

బుధవారం 13 ఆగస్టు 2025 పేజీలు : 10


# భారీ వర్ష సూచన నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి




అత్యవసరం అయితేనే ఇళ్ళ నుండి బయటకు రావాలి

ఎక్కడైనా ఇబ్బందులు ఎదురైతే కంట్రోల్ రూమ్ కు సమాచారం ఇవ్వండి

క్షేత్రస్థాయి లో అధికారులు అప్రమత్తంగా ఉండాలి

అత్యవసర పరిస్థితులు అయినందున సెలవులు రద్దు

అధికారులు, సిబ్బంది అందరూ అందుబాటులో ఉండాలి

జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆకస్మిక తనిఖీ

› డెంగ్యూ, మలేరియా నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలి

›24 గంటలపాటు వైద్య సేవలు అందించాలి

›ప్రభుత్వ ఆసుపత్రులపై నమ్మకం పెంపొందించాలి

›నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్



# పరిశ్రమల్లో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి




పరిశ్రమలలో భద్రతా పరంగా ప్రమాణాలు తనిఖీ చేసి ఎటువంటి ప్రమాదాలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని వివిధ శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వి.సి.కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి వివిధ విభాగాల ఉన్నతాధికారులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, జిల్లా ఫైర్ ఆఫీసర్, జీ ఏం ఇండస్ట్రీస్, కాలుష్య నియంత్రణ మండలి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్, బాయిలర్ ఇన్స్పెక్టర్, అలాగే బల్క్ డ్రగ్ ఫార్మా ఫర్ములేషన్ ఫ్యాక్టరీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# బాలిక తల్లి తండ్రులకు ఫోన్ చేసిన మంత్రి




కొల్లాపూర్ పట్టణంలోని సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. నేరుగా విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ఇటీవల డైట్ చార్జీలు పెంచిన నేపథ్యంలో మెనూ అమలుపై విద్యార్థులను ఆరా తీశారు.

# ఒరిగిన స్తంభాలు వేలాడుతున్న తీగలు

**వెల్టూరులో 33/11కేవీ స్తంభాల పతనం బీజేపీ నేతల ఆగ్రహం**

**చిన్నంబావి మండలం, ప్రజా జ్యోతి ఆగస్టు 12** వెల్లటూరు, చిన్నంబావి మండలం:తాజాగా వెల్లటూరు గ్రామంలో ఏర్పడిన విద్యుత్ ప్రమాదం పట్ల బీజేపీ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి పనులు ప్రజా ప్రయోజనాల కోసం కాకుండా, నిర్లక్ష్యంతో జరుగుతున్నాయని వారు ఆరోపించారు.దాదాపు 10 రోజుల క్రితం ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చేతుల మీదుగా వెల్లటూరు గ్రామం లో కొత్త 33/11కేవీ సబ్‌స్టేషన్ ప్రారంభించబడింది. అయితే, ఆరంభోత్సవం జరిగిన కొద్ది రోజుల్లోనే ఎస్సీ కాలనీలో ఏర్పాటు చేసిన ఐదు విద్యుత్ స్తంభాలు ఒక్కసారిగా కూలిపోవడంతో గ్రామంలో కలకలం రేగింది.స్థానికుల వివరాల ప్రకారం,స్తంభాలను బలమైన కాంక్రీట్ బేస్ లేకుండా, కేవలం మట్టిలోనే నాటడం వల్లే ఈ ప్రమాదం సంభవించింది. ముఖ్యంగా స్తంభాల దగ్గర నీటి కాలువ ఉండడం వల్ల మట్టి కదిలి స్తంభాలు వంగి, చివరికి పడిపోయాయి. దీంతో కాలనీలో నివసించే పేద ప్రజలు, గుడిసెలలో ఉంటున్నవారు భయాందోళనకు గురయ్యారు.బీజేపీ నేతల ప్రత్యక్ష నిరసన ఈ విషయం తెలుసుకున్న బీజేపీ రాష్ట్ర నాయకుడు కురువ చిన్న మల్లయ్య, మండల అధ్యక్షుడు బొగ్గు కురుమయ్య, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు కత్తి జానీ, గణేష్ రెడ్డి, పల్లె మద్దిలేటి నరసింహ తదితరులు కాలనీలో ప్రత్యక్షంగా వెళ్లి పరిస్థితిని? పరిశీలించారు.తరువాత వారు కరెంట్ ఏఈకి.చరవాణి ద్వారా స్తంభాలను కాంక్రీట్ బేస్‌తో మళ్లీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కరించకపోతే బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు.కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు "ఇది ప్రజా పాలన కాదు, నిర్లక్ష్య పాలన. పేద ప్రజల





ప్రాణాలకు ముప్పు కలిగించేలా పనులు చేస్తున్న కాంట్రాక్టర్లను రక్షిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలతో మోసం చేస్తోంది" అని కురువ చిన్న మల్లయ్య వ్యాఖ్యానించారు.గ్రామస్తులు కూడా ఈ ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, "ప్రారంభోత్సవం కోసం హడావుడిగా పనులు చేసి, ఇప్పుడు మమ్మల్ని ప్రమాదంలోకి నెట్టేశారు" అని తెలిపారు.స్థానికుల డిమాండ్లు.కాలనీవాసులు స్తంభాలను బలమైన కాంక్రీట్ బేస్‌తో మళ్లీ నాటాలని, భవిష్యత్తులో ఇలాంటి నిర్లక్ష్యానికి తావు ఇవ్వకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు

## కోళ్ళ పరిశ్రమ నిర్మించ వద్దని అఖిల పక్షం తీర్మానం

**కల్వకుర్తి, ఆగస్టు 12 (ప్రజా జ్యోతి):** కల్వకుర్తి మండలం తాండ్ర గ్రామ సరిహద్దు లో నిర్మిస్తున్న కోళ్ల పరిశ్రమను నిర్మించ వద్దని డిమాండ్ చేస్తూ తాండ్ర, పోతేపల్లి,లింగారెడ్డి పల్లి గ్రామాల రైతులు ప్రజలు అఖిల పక్షం ఆధ్వర్యంలో తీర్మానం చేశారు.మంగళ వారం కల్వకుర్తి మండలం తాండ్ర గ్రామ సరిహద్దు లోని జైహింద్ రెడ్డి వ్యవసాయ క్షేత్రంలో అఖిల పక్షం ఆధ్వర్యంలో కల్వకుర్తి పోతేపల్లి లింగా రెడ్డి పల్లి గ్రామాల రైతులు ప్రజలు పెద్ద కోళ్ళ పరిశ్రమ నిర్మాణానికి వ్యతిరేకంగా నిరసన సమావేశం నిర్వహించారు.రాజకీయాలకు అతీతంగా కోళ్ల పరిశ్రమ ను అడ్డుకోవాలని తీర్మానం చేశారు.గ్రామ సభ నిర్వహించకుండా కోళ్ల పరిశ్రమ నిర్మాణానికి అనుమతి ఇచ్చిన గ్రామ కార్యదర్శి,ప్రత్యేక అధికారి పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఏ విషయమై జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం ఇవ్వాలని నిర్ణయించారు.కార్యక్రమం లో కాంగ్రెస్ బీఆర్ యస్,బీజేపీ, బీఎస్పీ నాయకులతో పాటు ఆయా గ్రామాల రైతులు ప్రజలు పాల్గొన్నారు

## నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాల ఏర్పాటు

**సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి**

**హైదరాబాద్ :** ఖజానా జ్యువెలరీ బంగారం షాప్ దొంగతనం కేసులో నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి తెలిపారు. చోరీ ఘటనపై మాట్లాడిన సీపీ.. 10.35 గంటలకు బైక్ లపై వచ్చిన ఆరుగురు నిందితులు మాస్క్ లు ధరించి షాప్ లోకి చొరబడ్డారని, అందులో ముగ్గురి వద్ద గన్ లు ఉన్నట్లు తెలిపారు.

# భారీ వర్ష సూచన నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

**అత్యవసరం అయితేనే ఇళ్ళ నుండి బయటకు రావాలి**
**ఎక్కడైనా ఇబ్బందులు ఎదురైతే కంట్రోల్ రూమ్ కు సమాచారం ఇవ్వండి**
**క్షేత్రస్థాయి లో అధికారులు అప్రమత్తంగా ఉండాలి**
**అత్యవసర పరిస్థితులు అయినందున సెలవులు రద్దు**
**అధికారులు, సిబ్బంది అందరూ అందుబాటులో ఉండాలి**
**జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్**

నారాయణపేట జిల్లా ప్రతినిధి ప్రజాజ్యోతి ఆగస్టు12: రానున్న 72 గంటలలో భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ చేసిన హెచ్చరికల నేపథ్యంలో అందరూ అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. భారీ వర్ష సూచన నేపథ్యంలో ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి మంగళవారం సాయంత్రం మంత్రులు శ్రీధర్ బాబు, తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రావు, డీజీపీ జితేందర్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్ సచివాలయం నుండి అన్ని జిల్లాల కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు, ఎస్పీలతో వీడియో పట్నాయక్ ముఖ్యమంత్రి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్నారు. ముఖ్యమంత్రి వీ.సీ ముగిసిన అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో సమావేశమై కీలక సూచనలు చేశారు. భారీ వర్ష సూచనల నేపథ్యంలో ఎలాంటి అత్యవసర పరిస్థితులు తలెత్తినా, సమర్థవంతంగా ఎదుర్కొనేలా అన్ని విధాలుగా సన్నద్ధం అయి ఉండాలని సూచించారు. ఎక్కడ కూడా ప్రాణ నష్టం, ఆస్తి నష్టం, మూగ జీవాలు ప్రాణాలు కోల్పోకుండా ముందస్తుగానే జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. అత్యవసర పరిస్థితుల దృష్ట్యా ఉద్యోగుల సెలవులు రద్దు చేస్తున్నామని, అధికారులు, సిబ్బంది అందరూ అందుబాటులో ఉండాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో విధుల్లో ఉంటూ, అనుక్షణం అప్రమత్తంగా వ్యవహరించాలని, ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వ యంత్రాంగం యావత్తు అండగా ఉందనే భరోసాను ప్రజలకు కల్పించాలని హితవు పలికారు. ముఖ్యంగా రెవెన్యూ, పోలీస్, వైద్యారోగ్య, ఇరిగేషన్, విద్యుత్, పంచాయతీ రాజ్, రోడ్లు-భవనాల శాఖలు, విపత్తు నిర్వహణ సంస్థలు రాబోయే మూడు రోజుల పాటు అప్రమత్తంగా ఉంటూ, క్షేత్రస్థాయిలో సెలవులపై తగు నిర్ణయం తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. లోతట్టు ప్రాంతాలు, నదీ




పరీవాహక ప్రాంతాల ప్రజలను ముందుగానే అప్రమత్తం చేయాలని అధికారులకు సూచించారు. ఆయా శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పని చేస్తూ, జిల్లాలో ఎక్కడ కూడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అప్రమత్తతతో వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ స్పష్టం చేశారు. లో లెవెల్ వంతెనలు, కాజ్ వే మీదుగా వరద ప్రవాహం ఉన్న సమయాలలో రాకపోకలను నిషేధించాలని, చెరువులు, కాలువలు, నదులలో చేపల వేట, ఈత కోసం ఎవరూ వెళ్ళకుండా కట్టడి చేయాలన్నారు. భారీ వర్షాల వల్ల చెరువులు, కాలువ కట్టలు తెగి పోకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని, నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని హితవు పలికారు. భారీ వర్షాలు, ట్రాన్స్ఫార్మర్లు కూలిపోవడం వంటివి చోటుచేసుకున్న సందర్భాలలో యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని ట్రాన్స్కో అధికారిని ఆదేశించారు. ఎక్కడైనా రోడ్లు తెగిపోవడం వంటివి జరిగితే, ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ట్రాఫిక్ మళ్లింపు చేపట్టి రాకపోకలను పునరుద్ధరించాలని, జనజీవనం స్తంభించిపోకుండా, ప్రజలకు అసౌకర్యం కలుగకుండా తక్షణ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, దారిమళ్ళింపు చర్యలలో పోలీసు అధికారులు, సిబ్బంది క్రియాశీలంగా పాల్గొనాలని సూచించారు. పురాతన, శిథిలావస్థకు చేరిన భవనాలలో ఉంటున్న వారిని వెంటనే ఖాళీ చేయించాలని, లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రదేశాలకు తరలించాలన్నారు. పునరావాస కేంద్రాలను ముందుగానే గుర్తిస్తూ, అవసరమైన సమయంలో వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలను అక్కడికి తరలించి ఆహారం, ఇతర సదుపాయాలు సమకూర్చేలా ఏర్పాట్లు చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. భారీ వర్షాలతో వరద జలాలు ఏర్పడి సీజనల్ వ్యాధులు ఎక్కడికి వెళ్ళరాదని అందుబాటులో ఉండాలన్నారు. ఎంపీడీవోలు అందుబాటులో ఉండి ఎప్పటికప్పుడు సమాచారం అందించాలన్నారు. హెల్త్ డిపిఓ శాఖలు కూడా అప్రమత్తంగా ఉండాలన్నారు. అధికారులంతా హెడ్ క్వార్టర్ లో అందుబాటు లో ఉండాలని, ఎవరికి సెలవులు ఉండవని కలెక్టర్ ఆదేశించారు. ఎస్పీ యోగేష్ గౌతమ్ మాట్లాడుతూ ... జిల్లాలో నాలుగు చోట్ల ప్రమాదాలు జరిగే ప్రాంతాలుగా గుర్తించడం జరిగిందన్నారు. అందరూ అధికారుల సమన్వయంతో ఎలాంటి సమస్యనైనా ఎదుర్కొంటామని తెలిపారు. ప్రజలకు అత్యవసరమైతే కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు. జిల్లాలో మక్తల్ మంతన్ గోడు వాగు, ఊట్కూరు మల్లేపల్లి నాగిరెడ్డిపల్లి, మరికల్ ఇబ్రహీంపట్నం వాగులు అలుగు పారుతున్నాయని ఆయా ప్రాంతాలలో అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్సులో అదనపు కలెక్టర్లు సంచిత్ గంగ్వార్ ఎస్. శ్రీను, ట్రైనీ కలెక్టర్ ప్రణయ్ కుమార్, జడ్పీ సీఈవో శైలేష్, ఆర్డీఓ రామచంద్రనాయక్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలి

**జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**



**వనపర్తి ప్రతినిధి, ఆగస్టు 12 (ప్రజా జ్యోతి):** ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ ఆత్మకూరు మున్సిపాలిటీలోని కమ్యూనిటీ హెల్త్ సెంటరును తనిఖి చేశారు. ప్రసవాల రిజిస్టరు, ఈ.డి.డి రిజిస్టరు, ల్యాబ్ రిజిస్టరును పరిశీలించిన కలెక్టర్ కమ్యూనిటీ హెల్త్ సెంటరులో నలుగురు డాక్టర్లు, 7 మంది స్టాఫ్ నర్సులు, ఒక హెడ్ నర్స్, అన్ని మౌలిక సదుపాయాలు ఉండి నెలలో 2-3 ప్రసవాలు మాత్రమే జరగటం ఏంటని సూపరిండెంట్ ను ప్రశ్నించారు. ఇది ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిబ్బంది మధ్య సమన్వయం చేసుకోవాలని, ఈ.డి.డి. ఉన్న గర్భిణులు, ఆశా వర్కర్లతో మాట్లాడి సి.హెచ్.సి లో ప్రసవాలు జరిపించాలని ఆదేశించారు. నెలలో కనీసం 30 ప్రసవాలు నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. జ్వరం ఒళ్ళు నొప్పులతో వచ్చే రోగులకు కచ్చితంగా డెంగ్యూ పరీక్షలు నిర్వహించాలని, ర్యాట్ పరీక్షల్లో పాజిటివ్ వస్తె టి. హబ్ కు పంపించాలని ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా శ్రీనివాసులు, డా. చైతన్య, సి హెచ్.సి వైద్యులు తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

# పరిశ్రమల్లో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి

**జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి**



**మహబూబ్ నగర్ ఆగస్టు 12 ( ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి )** పరిశ్రమలలో భద్రతా పరంగా ప్రమాణాలు తనిఖీ చేసి ఎటువంటి ప్రమాదాలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని వివిధ శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వి.సి.కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి వివిధ విభాగాల ఉన్నతాధికారులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, జిల్లా ఫైర్ ఆఫీసర్, జీ ఏం ఇండస్ట్రీస్, కాలుష్య నియంత్రణ మండలి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్, బాయిలర్ ఇన్స్పెక్టర్, అలాగే బల్క్ డ్రగ్ ఫార్మా ఫర్ములేషన్ ఫ్యాక్టరీ ప్రతినిధులు పాల్గొన్నారు. సంగారెడ్డి జిల్లా పాశమైలారం ప్రాంతంలో జూన్ 30, 2025న జరిగిన భారీ పేలుడు ప్రమాదం అనంతరం, పరిశ్రమల్లో అమలులో ఉన్న భద్రతా ప్రమాణాలను పునఃపరిశీలించడం, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా నివారించేందుకు చేపట్టే చర్యలపై చర్చించేందుకు సమావేశం నిర్వహించి వివిధ అంశాలను చర్చించారు. సమావేశంలో భద్రతా తనిఖీలు - తెలంగాణ ప్రభుత్వం లేబర్, ఎంప్లాయ్మెంట్, ట్రైనింగ్ ఫ్యాక్టరీస్ విభాగం జారీ చేసిన జీ ఓ అర్ టీ నం . 331, తేది 04.08.2025 ప్రకారం, జిల్లా కలెక్టర్ జిల్లా స్థాయి కమిటీలు ఏర్పాటు చేయడం, వాటి ద్వారా తక్షణమే పరిశ్రమల తనిఖీలు చేపట్టడం, తనిఖీ షెడ్యూల్ రూపొందించి, తనిఖీలు దశలవారీగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు మొదటి దశలో అన్ని రసాయన, ఔషధ పరిశ్రమలను ఒక నెలలోపు సమగ్రంగా తనిఖీ చేయాలని నిర్ణయం తీసుకున్నారు. కార్మికుల భద్రతా శిక్షణ కార్మికులకు క్రమం తప్పకుండా భద్రతా శిక్షణ మరియు మాక్ డ్రిల్లులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. కార్మికుల ప్రాణ భద్రత అన్నది ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యం కలిగిన అంశం అని ఏ పరిశ్రమ అయినా భద్రతా ప్రమాణాలను నిర్లక్ష్యం చేస్తే, కఠిన చర్యలు తీసుకోబడతాయని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ తనిఖీల ద్వారా సురక్షితమైన పని వాతావరణం కల్పించడం, పరిశ్రమల్లో సున్నా ప్రమాద లక్ష్యం సాధించడం లక్ష్యం గా పని చేయాలని సూచించారు. ఈ సమావేశం లో డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ కె.శ్రీనివాస రావు, జిల్లా ఫైర్ ఆఫీసర్ కిషోర్, జీఎం ఇండస్ట్రీస్ ప్రతాప్, కాలుష్య నియంత్రణ మండలి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సురేష్, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ చంద్ర శేఖర్ గౌడ్, బాయిలర్ ఇన్స్పెక్టర్ మహేష్ కుమార్, ఇన్స్పెక్టర్ ఆఫ్ ప్యాక్ట రీస్ జంగయ్య, తదితరులు పాల్గొన్నారు. తొలుత కమిటీ జిల్లాలో జడ్చర్ల లోని విక్రో పెట్రో కెమ్, బాలానగర్ లోని వివంటా లాబ్, పోలేపల్లి లోని శ్రీనివాస ఆర్గానిక్స్ పరిశ్రమలను తనిఖీ చేశారు. ఈ తనిఖీ లో ఆయా పరిశ్రమలలో భద్రతా లోపాలు గమనించి నెల రోజుల్లో సరి చేసుకోవాలని వారికి సూచించారు. జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక మండలి సమావేశం జిల్లాలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తూ టి.జి. ఐపాస్ ద్వారా పరిశ్రమల స్థాపనకు వివిధ శాఖల నుండి మంజూరు చేయవలసిన అనుమతులను నిబంధనల మేరకు నిర్దేశిత గడువులోగా మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక కమిటీ సమావేశానికి హాజరై ఆమె మాట్లాడారు. టి ప్రైడ్ ద్వారా షెడ్యూల్డ్ తెగకు చెందిన మహిళకు ట్రాన్స్పోర్ట్ సెక్టర్ కింద గూడ్స్ క్యారేజీ వాహనం పెట్టుబడి సబ్సిడీ మంజూరు కు కమిటీ లో ఆమోదం తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల జనరల్ మేనేజర్ పి.ప్రతాప్ రెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## విజయవంతమైన శ్రీ రాఘవేంద్ర స్వామి ఆరాధన ఉత్సవాలు



**గద్వాల ఆగస్టు12(ప్రజా జ్యోతి ప్రతినిధి):**భక్తుల పాలిట కల్పతరువు,మంత్రాలయం గురుసార్వభౌమ శ్రీ రాఘవేంద్ర స్వామి 354వ,ఆరాధన ఉత్సవాలు గద్వాలలో గత మూడు రోజులు పాటు ఘనంగా జరిగాయి. గద్వాల పట్టణంలోని భీమ్ నగర్ లో గల శ్రీ రాఘవేంద్ర స్వామి దేవాలయంలో పూర్వారాధన, మధ్యారాదన, ఉత్తరారాధన సందర్భంగా శ్రీ స్వామి వారి బృందావనానికి పంచామృతాభిషేకం, అష్టోత్తర పారాయణము, హస్తోదకం, మంగళహారతులు, రథోత్సవం నిర్వహించారు. మంగళవారం ఉత్తరారాధన సందర్భంగా పవమాన హెూమం, రథోత్సవం కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు మన్నూరు ప్రహల్లాద చారి పట్టణానికి చెందిన పలువురు భక్తులు హాజరై స్వామి వారిని దర్శించుకునీ మొక్కులు సమర్పించుకున్నారు.

## మద్దూర్ లో 35 ఫీట్ల గణేష్, సీఎంను ఆహ్వానించిన

**:బాల హనుమాన్ గణేష్ యూత్ అసోసియేషన్**

**సానుకూలంగా స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి**

**ముఖ్యమంత్రి ఇలాకాలో మరో ఖైరతాబాద్ గణేశ్**



**నారాయణపేట జిల్లా ప్రతినిది ప్రజాజ్యోతి ఆగస్టు12:**మద్దూరు మున్సిపాలిటీ పట్టణ కేంద్రంలో గణేష్ పండగ సందర్భంగా బాల హనుమాన్ గణేష్ యూత్ అసోసియేషన్ తరపున 35 ఫీట్ల గణేష్ ఏర్పాటు చేయడం జరుగుతుంది.ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి కలిసి తప్పకుండా రావాలని యూనియన్ తరపున ఆహ్వాన పత్రిక ఇవ్వడం జరిగింది.సీఎం సానుకూలంగా స్పందిస్తూ తప్పకుండా వస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో మద్దూరు మండల పిఎసిఎస్ చైర్మన్ నర్సిములు, రమేష్ రెడ్డి,బాల హనుమాన్ గణేష్ యూత్ అసోసియేషన్ అధ్యక్షులు తలారి సాయిలు సాయిలు, ఉపాధ్యక్షులు భరత్ కుమార్, సిపిరి సూర్య కిరణ్, ప్రధాన కార్యదర్శి పిల్లగంట్ల విజయ్ కుమార్,సభ్యులు వెంకటేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పూడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ బి.ఎం.సంతోష్





**గద్వాల ఆగస్టు12(ప్రజా జ్యోతి ప్రతినిధి):** విద్యార్థులు పాఠాన్ని కేవలం చదవడం కాకుండా, దాని భావం పూర్తిగా అర్థం చేసుకునేలా బోధించాలని జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్ ఉపాధ్యాయులకు ఆదేశించారు. సోమవారం గద్వాల్ మండలంలోని పూడూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలలోని విద్యార్థుల అభ్యసన, హాజరు, ఏకరూప దుస్తులను పరిశీలించారు. 10వ, తరగతి విద్యార్థులతో మాట్లాడి,ఇంగ్లీష్ పాఠ్యంలోని ఒక పేరాగ్రాఫ్ చదివించారు .చాలా మంది విద్యార్థులు చదివినది అర్థం చెప్పలేకపోవడంతో కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. చదువులో వెనుకబడిన వారికి ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, పాఠాలు అందరికీ అర్థమయ్యే రీతిలో బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులు కేవలం పఠించడం మాత్రమే కాకుండా, దాని భావాన్ని,పూర్తిగా అర్థం చేసుకోనే విధంగా బోధించాలన్నారు. పాఠశాలలో హాజరు శాతం తక్కువగా ఉండటం గుర్తించిన కలెక్టర్, విద్యార్థులందరూ ప్రతిరోజూ తప్పనిసరిగా తరగతులకు హాజరవ్వాలని అన్నారు. ఎవరూ గైర్హాజరు కాకుండా ఉపాధ్యాయులు జాగ్రత్తలు తీసుకోవాలని, హాజరును ఖచ్చితంగా నమోదు చేయడానికి ప్రతిరోజూ ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్ వాడాలని ఆయన ఆదేశించారు. విద్యార్థులు యూనిఫాం ధరించకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. యూనిఫాం పాఠశాల క్రమశిక్షణకు, విద్యార్థుల సమానత్వానికి ప్రతీక అని గుర్తు చేస్తూ,ప్రతి విద్యార్థి ప్రతిరోజూ తప్పనిసరిగా యూనిఫాం ధరించేలా ఉపాధ్యాయులు పర్యవేక్షించాలని సూచించారు.ఈ నియమాన్ని పాటించని పక్షంలో ప్రిన్సిపల్‌కు మెమో జారీ చేస్తామని సంబంధిత అధికారులకు సూచించారు. పదవ తరగతి విద్యార్థులు పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించేందుకు, ఇప్పటి నుంచే సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ క్రమశిక్షణతో చదవాలని సూచించారు. ప్రతిరోజూ పాఠాలను శ్రద్ధగా వినడం, అదే రోజు పునశ్చరణ చేయడం, అర్థం కాని భాగాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోవడం, క్రమం తప్పకుండా ప్రాక్టీస్ పరీక్షలు రాయడం వంటి అలవాట్లు అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. నిరంతర శ్రమ, పట్టుదల, సమయపాలనతో మాత్రమే మంచి మార్కులు సాధించగలమని విద్యార్థులకు ప్రేరణనిచ్చారు. 'అనంతరం అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్ల పోస్టర్ ను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సహాయ లేబర్ కమిషనర్ మహేష్ కుమార్, జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి ప్రియాంక, ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు,పాఠశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆకస్మిక తనిఖీ

- డెంగ్యూ, మలేరియా నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలి
- 24 గంటలపాటు వైద్య సేవలు అందించాలి
- ప్రభుత్వ ఆసుపత్రులపై నమ్మకం పెంపొందించాలి
- నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్



**నాగర్ కర్నూల్ ఆగస్ట్ 12 ( ప్రజా జ్యోతి ప్రతినిధి)** ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తూ, ప్రభుత్వ ఆసుపత్రుల పట్ల నమ్మకాన్ని పెంపొందించాలని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, సూచించారు. మంగళవారం నాగర్ కర్నూల్ నియోజకవర్గ పరిధిలోని తెల్కపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిసెప్షన్ సెంటర్, ఇన్ పేషంట్, ఫిమేల్, వార్డులు, ల్యాబ్ తదితర విభాగాల పనితీరు పరిశీలించారు. ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న వైద్యులు, సిబ్బంది గురించి ఆరా తీసిన కలెక్టర్ అటెండెన్స్ రిజిస్టర్ తనిఖీ చేశారు. ప్రతి రోజు ఎంత మంది పేషంట్లు వస్తున్నారు, స్థానికంగానే కాన్పులు చేస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. హెల్త్ సెంటర్ ద్వారా అందిస్తున్న వైద్య సేవల గురించి ఆరా తీస్తూ, రికార్డులను తనిఖీ చేశారు. ఇమ్యునైజేషన్, ఏ.ఎన్.సీ చెకప్ లు, టీ.బీ ముక్త్ భారత్ అభియాన్, ఆరోగ్య శిబిరాల నిర్వహణ తదితర సేవలను ప్రజలు సదివినియోగం చేసుకునేలా చూడాలని హితవు పలికారు. హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో చేపట్టే ఆరోగ్య శిబిరాలు, ఇతర వైద్య సేవా కార్యక్రమాల గురించి ముందస్తుగానే ప్రజలకు తెలిసేలా విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. డెంగ్యూ, మలేరియా, విష జ్వరాలు వంటివి ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, ఒకవేళ ఎవరికైనా సీజనల్ వ్యాధులు సోకితే తగిన చికిత్సలు అందిస్తూ, ఇతరులకు సోకకుండా పరిసర ప్రాంతాలను ఫాగింగ్ జరిపించాలని అన్నారు. సాధ్యమైనంత వరకు సాధారణ ప్రసవాలు జరిగేలా కృషి చేయాలని వైద్యులకు సూచించారు. అన్ని రకాల మందులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల పట్ల ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందించేలా అంకిత భావంతో పని చేయాలని హితవు పలికారు. రౌండ్ ది క్లాక్ ఆసుపత్రులలో అన్ని సమయాలలో వైద్యులు, సిబ్బంది విధుల్లో ఉండాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ వెంట మండల తహసిల్దార్ జాకీర్ అలీ, మండల వైద్యాధికారి డాక్టర్ అనిత తదితరులు ఉన్నారు.

## ధన్వాడలో ఘనంగా ఎర్ర సత్యం 30 వ వర్ధంతి వేడుకలు



**ధన్వాడ ఆగష్టు 12 (ప్రజా జ్యోతి)** ధన్వాడ మండల కేంద్రంలో స్వర్గీయ మాజీ ఎమ్మెల్యే ఎర్ర సత్యం 30వ వర్ధంతి సందర్భంగా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం జిల్లా ఉపాధ్యక్షులు నీరటి నర్సిములు నాయుడు ముదిరాజ్,ధన్వాడ ఏప్ సి ఎస్ అధ్యక్షులు ఆధ్వర్యంలో ఎర్ర సత్యం వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎర్ర సత్యం బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి పాలమూరు ముద్దుబిడ్డ బలహీనవర్గాల అభివృద్ధికి కోసం తన ప్రాణాలను అర్పించారని న్యాయం కోసం ధర్మం కోసం అహర్నిశలు శ్రమించి పేదల జీవితాలలో వెలుగులను నింపాడని కొనియాడారు అదేవిధంగా అన్ని వర్గాల నాయకులు ఆయనను స్మరించుతూ ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పంది రామచంద్రయ్య మాజీ ఎంపీపీ నీరటి రామచంద్రయ్య మార్కెట్ కమిటీ డైరెక్టర్ జట్రం లక్ష్మయ్య గౌడ్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గౌని శ్రీనివాసులు మాజీ ఎంపిటిసి జట్రం గోవర్ధన్ గౌడ్ మాజీ ఎంపిటిసి లంకాల శ్రీనివాస్ గౌడ్ మాజీ ఎంపిటిసి చీరాల సుధాకర్ రెడ్డి ధన్వాడ మండల రెడ్డి సేవా సమితి అధ్యక్షులు సంద బాల నరసింహులు ఉపాధ్యక్షులు వలికే ఆనంద్ డైరెక్టర్ నీరటి నారాయణ కంచె రఘువీర్ రామాంజనేయులు జట్రం రాజేష్ కుమార్ గౌడ్ సంద బాలరాజు సంద రాములు చీరాల విష్ణువర్ధన్ రెడ్డి సుంకు సత్యనారాయణ శెట్టి శంకర్ భాస్కర్ మైనార్టీ నాయకులు తాజుద్దీన్ షాకీర్ హుస్సేన్ రహమాన్ ఖాన్ కురుమయ్య నర్సింలు చెన్నప్ప శంకర్ మూలింటి రామాంజనేయులు భానుచందర్ బాలచందర్ తదితరులు పాల్గొన్నారు

## ఆధ్యాత్మికతను ఆవర్చుకోవాలి

:నీలకంఠపట్టాదార్య స్వామిజీ



**నారాయణపేట జిల్లా ప్రతినిది ప్రజాజ్యోతి ఆగస్టు12:** మద్దూరు నీటి ఉరుకుల పరుగుల జీవితంలో అధ్యాత్మికతను అవర్చుకొని ప్రశాంతమైన జీవనం కొనసాగించాలని కురిపినిశెట్టి (జాంధ్ర) సమాజం కుల గురువు నీలకంఠపట్టాదార్య స్వామిజీ తెలిపారు. మంగళవారం మద్దూరు పట్టణానికి రావడంతో స్థానిక పాతబస్టాండ్ ఆంజనేయస్వామి దేవాలయం నుంచి మేళతాళాలు, భజన మధ్య జాంధ్ర సమాజం స్వామిజీని ఊరేగింపుగా నీలకంఠస్వామి దేవాలయంకు తీసుకెళ్లారు.ఈ సందర్భంగా నీలకంఠస్వామికి స్వామిజీ ప్రత్యేకాభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తి ప్రవచనాలను బోధించారు. శ్రావణంలో ఎంతో పవిత్రమైనదని, ఈ మాసంలో ఏ కార్యం చేపట్టినా శుభం కలుగుతుందన్నారు. అనంతరం జాంధ్ర సమాజిం భక్తులు స్వామికి పాదసేవ చేశారు.ఈ కార్యక్రమంలో కుల పెద్దలు సంజీవ్, భాస్కర్, రవికుమార్, రమేష్, శ్రీనివాస్, అంజయ్య, చంద్రశేఖర్, చంద్రమోహన్, తదితరులు పాల్గొన్నారు.

# ఎరువుల గోడౌన్ ను తనిఖీ చేసిన కలెక్టర్

ఎరువుల స్టాక్ వివరాలు బహిరంగ ప్రదర్శన చేయాలి
రైతులకు నిశ్చింత,ఎరువుల కొరత లేదు
ఎరువుల సరఫరా సజావుగా కొనసాగాలి
జిల్లా లో రైతుల అవసరాలకు తగిన ఎరువుల స్టాక్ అందుబాటులో ఉన్నది



**నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్** నాగర్ కర్నూల్ ఆగస్టు 12 ( ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి) మంగళవారం నాగర్ కర్నూల్ నియోజకవర్గ పరిధిలోని తెల్కపల్లి మండల కేంద్రంలో ఉన్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఎరువుల విక్రయ కేంద్రాన్ని కలెక్టర్ బాదావత్ సంతోష్ ఆకస్మికంగా సందర్శించారు. అక్కడ ఎరువుల విక్రయాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. రైతుల అవసరాలకు మించి ఎరువులు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దుకాణం ముందు సూచిక బోర్డు తప్పనిసరి ఉంచాలని, సూచిక బోర్డుపై ఎరువుల మందుల నిలువలు పట్టికలో రాయాలని, రైతులకు సరైన ధరలకు అమ్మాలని సూచించారు. అదే విధంగా రైతులకు ఎరువులు నాణ్యతమైనవి అందించాలని, కాలం చెల్లిన (ఎక్స్ పైర్) మందులను రైతులకు అమ్మ రాదని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ స్పష్టం చేశారు. గోడౌన్ లో రికార్డులలో పేర్కొన్న విధంగా ఎరువుల నిల్వలు అందుబాటులో ఉన్నాయా అని పరిశీలించారు. ఎరువుల విక్రయాలను ఈ-పాస్ ద్వారా నిర్వహిస్తున్నారా లేదా అని తనిఖీ చేశారు. స్టాక్ కొంత మిగిలి ఉన్నప్పుడే ఇండెంట్ సమర్పించి, ఎరువులను గోడౌన్ కు తెప్పించుకోవాలని నిర్వాహకులకు సూచించారు. జిల్లాలో ఎరువుల కొరత లేదని, రైతులు అవసరానికి మించి ఎరువులు కొనుగోలు చేసి నిల్వ చేయవద్దని కలెక్టర్ సూచించారు. రైతులకు అవసరమైన ఎరువులు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. అన్ని ప్రాంతాలలో రైతులకు ఎరువులు అందుబాటులో ఉండేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తున్నామని అన్నారు. యూరియా, ఇతర ఎరువుల విషయంలో రైతులు ఎలాంటి ఆందోళనకు గురి కావాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ వెంట మండల తహసీల్దార్ జాకీర్ అలీ, మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ సహకార కేంద్రం సిఈఓ, తదితరులు ఉన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు నిరంతరంగా కృషి చేయాలి..

ఎమ్మెల్యే జిఎంఆర్



**దేవరకద్ర ఆగస్టు 12 ప్రజా జ్యోతి** ప్రజా సమస్యల పరిష్కారం కోసం అన్ని శాఖలకు సంబంధించిన అధికారులు అందుబాటులో ఉండి నిరంతరంగా కృషి చేయాలని ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూడాలని స్థానిక ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి కోరారు. మంగళవారం మండల కేంద్రంలో స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విద్యుత్ శాఖ ఇరిగేషన్ శాఖ వ్యవసాయ శాఖ అధికారులతో మాట్లాడిన తర్వాత తదుపరి ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే జియంఆర్ మాట్లాడుతూ వర్షాకాలం దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ, నీటిపారుదల, విద్యుత్ శాఖ అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు. నియోజకవర్గంలో ప్రధాన ప్రాజెక్టులు కోయిల్ సాగర్, సరళ సాగర్ నిండుకుండల జలకల సంతరించుకున్నాయి అని ఆయన తెలిపారు. త్వరలో కోయిల్ సాగర్ గ్రావిటీ కెనాల్ ప్రారంభించబోతున్నాం అని ఆయన చెప్పారు. ప్రజలకు అధికారులు, మేము ఎల్లవేళలా అందుబాటులో ఉంటాం ఆయన చెప్పారు. వ్యవసాయ అధికారులతో యూరియా గురించి సుదీర్ఘంగా చర్చించా, ఎక్కడెక్కడ స్టాక్ ఉంది, రైతులకు ఎంత యూరియా అవసరముందనే 15 వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉంది, దానికి తగట్టు సమయానుకూలంగా రైతులకు యూరియా అందిస్తాం అని ఆయన తెలిపారు. రైతులు యూరియా విషయం లో అపోహలు పడవద్దు, తొందరపడి ఎక్కువ కొని స్టాక్ చేయవద్దని విజ్ఞప్తి చేశారు. రైతులకు సరిపడా యూరియా అందిస్తాం, గతంలో కన్నా ఎక్కువ ఈ సారి వరి సాగు అయింది. కొందరు యూరియా కృత్రిమ కొరత సృష్టించి, దండుకునే ఆలోచనలో ఉన్నారు. వారిపై కొరడా ఝలిపిస్తాం అని ఆయన హెచ్చరించారు. విద్యుత్ శాఖ అధికారులతో లో ఓల్టేజీ సమస్యపై చర్చించడం జరిగింది, త్వరలో నియోజకవర్గంలో అక్కడక్కడ ఉన్న లో ఓల్టేజీ సమస్యను పరిష్కరిస్తాం అని ఆయన తెలిపారు. లో వోల్టేజ్ సమస్యను తీర్చేందుకు నియోజకవర్గంలో, గత సంవత్సరం జనవరి నుండి డిసెంబర్ వరకు 270 ట్రాన్స్ఫార్మర్లు, ఈ సంవత్సరంలో నేటి వరకు 400 ట్రాన్స్ఫార్మర్లతో పాటు కండెన్సర్లు, వైర్లు రైతులకు ఇచ్చాం అని ఆయన చెప్పారు. పవర్ కట్ లేకుండా విద్యుత్ శాఖ అధికారులు నిరంతరం అప్రమత్తంతో పనిచేయాలని ఆయన ఆదేశించారు. వర్షకాలం దృష్ట్యా ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సమావేశంలో అధికారులు ప్రజా ప్రతినిధులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## గ్రావిటీ కాలువ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే..

**దేవరకద్ర ఆగస్టు 12 ప్రజాజ్యోతి** మండల కోయిల్ సాగర్ ప్రాజెక్ట్ నుండి గ్రావిటీ కాలువ ద్వారా గద్దెగూడెం, వెంకటయ్య పల్లి, దేవరకద్ర తదితర 20 గ్రామాల గొలుసు కట్టు చెరువులకు నీరు వెళ్లే గ్రావిటీ కెనాల్ పనులు పూర్తయిన సందర్భంగా కాలువను మంగళవారం స్థానిక ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి పరిశీలించారు. అజిలాపూర్ లిఫ్ట్ ఇరిగేషన్ పైలన్ ఆవిష్కరణకు సంబంధించి స్థానిక నాయకులతో ఎమ్మెల్యే చర్చించారు. ఎమ్మెల్యే వెంట నాయకులు అధికారులు పాల్గొన్నారు.



## సంగంబండ రిజర్వాయర్ ఒక గేటు ఎత్తి దిగువకు నీటి విడుదల



**మఖ్తల్ నియోజకవర్గ ప్రతినిధి, ఆగస్టు 12 (ప్రజా జ్యోతి):** ఎగువ కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షానికి పెద్దవాగు ఉధృతంగా ప్రవహిస్తూ భారీగా వరద నీరు నారాయణపేట జిల్లా మఖ్తల్ మండలం సంగంబండ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ లోకి వచ్చి చేరుతుండడంతో అప్రమత్తమైన ఇరిగేషన్ అధికారులు ఒక గేటు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. సంగంబండ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ లోకి ఎగువ పెద్దవాగు నుండి 500 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండడంతో ఒక గేటు ద్వారా 500 క్యూసెక్కుల వరదనీరు దిగువకు చేరుతుంది. సంగంబండ రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటి నిలువ 3.317 కాగా ప్రస్తుతం రిజర్వాయర్ లో 2.45 నీటి నిల్వ ఉంది. ఎగువ పెద్దవాగు నుండి వస్తున్న వరద నీటిని అధికారులు ఒక గేటు ద్వారా యధావిధిగా దిగువకు విడుదల చేస్తున్నారు. దిగువ వాగు పరివాహ ప్రజలు ఎవరు కూడా వాగులోకి వెళ్ళవద్దని అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

## ఎర్ర సత్యం ఆశయసాధనకు బీసీ పొలిటికల్ చేసి కృషి రాచాల యుగంధర్ గౌడ్.



**పెబ్బేరు ఆగస్టు 12( ప్రజా జ్యోతి )**పేద ప్రజల ఆశాజ్యోతి బడుగు బలహీనలకు అండగా నిలిచిన మాజీ ఎమ్మెల్యే సత్యం ఆశయ సాధనలో బిసి పొలిటికల్ జేఏసీ నడుస్తుందని బిసి పొలిటికల్ జెఎసి రాష్ట్ర కన్వీనర్ రాచాలా యుగంధర్ గౌడ్ అన్నారు. మంగళవారం ఆయన 30 వ వర్ధంతి సందర్భంగా పెబ్బేరు పట్టణంలోని సుభాష్ చౌరస్తాలు ఎర్ర సత్యం చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. సందర్భంగా రాచాలా యుగంధర్ గౌడ్ మాట్లాడుతూ బిసి వర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్యే ఎర్ర సత్యం ఎదుగుదలను చూసి ఓర్వలేని కొందరు అగ్రవర్ణ నాయకులు అతని మరణానికి కారణం అయ్యారని అన్నారు. బీసీలను ఐక్యంగా చేసి బీసి సమాజాన్ని స్థాపించే వరకు బిసి పొలిటికల్ జేఏసీ పోరాడుతుందని ఎర్ర సత్యం అడుగుజాడల్లో నడుస్తుందని పేదలఅభ్యున్నతి కోసం పోరాటం చేస్తుందని ఆయన అన్నారు. పెబ్బేరు చౌరస్తాలో ఎర్ర సత్యం విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు ఈ వజ్రాగౌని వెంకటయ్య గౌడ్, దేవర శివ, జితేందర్ గౌడ్, అంజన్న యాదవ్, రాఘవేందర్ గౌడ్, రామన్ గౌడ్, జనార్ధన్ గౌడ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# బాలిక తల్లి తండ్రులకు ఫోన్ చేసిన మంత్రి

**తల్లిండ్రులపై బెంగతో ఉన్న చిన్నారి బాలిక తల్లిదండ్రులకు ఫోన్ చేసిన మంత్రి**
**చిన్నారిని చూసి వెళ్లాలని సూచించిన మంత్రి**
**విద్యార్థిని ఓదార్చి ధైర్యం చెప్పిన మంత్రి జూపల్లి**
**గురుకుల పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జూపల్లి కృష్ణారావు**



**నాగర్ కర్నూల్ ఆగస్టు 12 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** కొల్లాపూర్ పట్టణంలోని సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. నేరుగా విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ఇటీవల డైట్ చార్జీలు పెంచిన నేపథ్యంలో మెనూ అమలుపై విద్యార్థులను ఆరా తీశారు. విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్ చేసి మీ పిల్లలకు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందుతుందా అని మంత్రి అడిగారు. మా పిల్లలకు నాణ్యమైన భోజనం అందుతోంది అని తల్లిదండ్రులు సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణంలోని తరగతి గదిని సందర్శించారు. పర్యావరణం అంటే ఏంటని విద్యార్థులను ప్రశ్నించారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఉద్బోధించారు. అనంతరం అదనపు తరగతి గదుల నిర్మాణం పూర్తి అయినప్పటికీ ఇంకా ఎందుకు ప్రారంభం కాలేదని టిజిఈడబ్ల్యుఐడిసి డీఈ వెంకట్ రెడ్డి, ఏఈ శ్రీనివాస్‌ను ప్రశ్నించారు. వెంటనే ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేయాలని ప్రాంగణం, బాత్రూమ్ వసతులను మెరుగు పరచాలని కోరగా, మంత్రి అక్కడికక్కడే జిల్లా కలెక్టర్ బాధావత్ సంతోష్ తో మాట్లాడి, డీఎంఎఫ్‌టీ నిధుల ద్వారా బాత్రూమ్ ల సమస్యను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. అలాగే, కాంపౌండ్ వాల్‌కు నిధులు ఇప్పటికే మంజూరైన నేపథ్యంలో పనులను వేగంగా పూర్తి చేయాలని పంచాయతీ రాజ్ ఏఈ కి ఆదేశాలు ఇచ్చారు తల్లితండ్రుల మీద బెంగతో రోదించిన బాలికను ఓదార్చిన మంత్రి జూపల్లి నాగర్ కర్నూల్ మండలం పెద్దాపురం గ్రామానికి చెందిన బాలిక తల్లిదండ్రల మీద బెంగతో రోదిస్తూ.. మంత్రి కంటపడ్డారు. దీంతో మంత్రి ఆ చిన్నారిని వద్దకు వెళ్లి ఓదార్చి, బాగా చదువుకొని ఉన్నతస్థాయికి చేరుకోవాలని ధైర్యం చెప్పారు. వెంటనే బాలిక తల్లిదండ్రులకు ఫోన్ చేసి విషయాన్ని మంత్రి వారికి వివరించారు. ప్రతీ శనివారం లేదా ఆదివారం స్కూల్ ను సందర్శించి మీ పాపతో రెండు గంటల పాటు గడిపి వెళ్లాలని కోరారు. పాఠశాలకు వచ్చి ఆ విద్యార్థిని చూసి వెళ్లాలని సూచించారు. పాపతో వారితో మాట్లాడించారు. మంత్రి నుంచి ఫోన్ రావడంతో వారు సంతోషాన్ని వ్యక్తం చేశారు.

## మృతిని కుటుంబానికి మేఘున్న చేయూత



**పెబ్బేరు ఆగస్టు12 (ప్రజా జ్యోతి)** శాఖాపూర్(వై)గ్రామానికి చెందిన గువ్వల సాయన్న అనారోగ్యంతో మృతి చెందారు ఈ విషయాన్ని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు,కావలి గోవింద్ వనపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే తూడి మెగారెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా స్పందించి 5000రూపాయలు మృతురాలు కుటుంబ సభ్యులకు పంపారు ఎమ్మెల్యే ఆదేశాలమేరకు ఆర్థిక సహాయాన్ని శాఖాపూర్ (వై )గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, కావలి గోవింద్, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు, జక్కుల శ్రీనివాసు, సింగిల్ విండో వైస్ ప్రెసిడెంట్ జక్కుల ఆంజనేయులు, ఉప్పరి కృష్ణయ్య, తెలుగు చంద్రన్న, తెలుగు పెద్ద కురుమన్న, పుట్టకురుమన్న, బడదల సాయన్న, పుట్ట ఉషన్న, జక్కులవెంకటయ్య, తెలుగు సాయిలు,తెలుగు నారాయణ, మద్దన్న, మాసన్న, కాంగ్రెస్ కార్యకర్తల సమక్షంలో 5వేల రూపాయలను కుటుంబాల సభ్యులకు అందజేశారు.

## హెయిర్ కటింగ్ షాప్ లకు వృత్తి పన్ను

**( ట్రేడ్ లైసెన్స్) మినహాయింపు గురించి పెబ్బేర్ మున్సిపల్ కమిషనర్ గారికి వినతిపత్రం అందజేసిన నాయి బ్రాహ్మణ సేవా సంఘం నాయకులు**



**పెబ్బేరు ఆగస్టు12 (ప్రజా జ్యోతి)** మున్సిపల్ కేంద్రంలోని హెయిర్ కటింగ్ షాపులకు ట్రేడ్ లైసెన్స్ లు తీసుకోవాలని మున్సిపల్ సిబ్బంది ఒత్తిడి తెస్తున్నారని నాయి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షులు బాలకృష్ణ, తెలంగాణఉద్యమకారుడు కాంగ్రెస్ నాయకులు రమణ, కాంగ్రెస్ నాయకులు అక్కి శ్రీనివాస్ గౌడ్ గారి దృష్టికి తెచ్చారు, రమణగారు తక్షణమే స్పందించి మీరు ఏమీ ఆందోళన చెందవద్దు ఈ సమస్యను నేను కమిషనర్ గారితో మాట్లాడుతాను అని కమిషనర్ గారు సానుకూలంగా స్పందించకపోతే ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని ఈరోజు తెలంగాణ ఉద్యమకారుడు కాంగ్రెస్ నాయకులు రమణ గారి సమక్షంలో కమిషనర్ గారిని కలిసి నాయి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షులునారాయణదాసు బాలకృష్ణ ఆధ్వర్యంలో పెబ్బేరు మున్సిపల్ కమిషనర్ గారికి హెయిర్ కటింగ్ సెలూన్లకు వృత్తి పన్ను (ట్రేడ్ లైసెన్స్) మినహాయింపు, వృత్తి పన్ను రద్దు గురించి గత ప్రభుత్వాలు జీవోలు ఇచ్చాయి అని జీవో కాపీలు జత చేసి పెబ్బేరు మున్సిపల్ కమిషనర్ గారికి వినతి పత్రం అందజేయడం జరిగింది, పెబ్బేరు మున్సిపల్ కమిషనర్ గారు సానుకూలంగా స్పందించి కొన్ని ప్రత్యేకమైన కుల వృత్తుల వారికి వృత్తి పన్ను లేదు ట్రేడ్ లైసెన్స్ సెక్షన్ 37 ,1987, ప్రకారం మినహాయింపు ఉన్న మాట వాస్తవమే అని, సానుకూలంగా స్పందించారు, కావున హెయిర్ కటింగ్ సెలూన్లకు మాత్రం వృత్తి పన్ను (ట్రేడ్ లైసెన్స్) అవసరం లేదని అన్నారు, ఈ కార్యక్రమంలో తెలంగాణఉద్యమకారుడు కాంగ్రెస్ నాయకులు రమణ తో పాటు నాయి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షులు నారాయణదాసు బాలకృష్ణ, సదుర్ల శంకర్, పరమేష్, పాల్గొన్నారు.

# కోతకు గురైన గ్రావిటీ కెనాల్ కాలువ



**మక్తల్ నియోజకవర్గ ప్రతినిధి,ఆగస్టు 12 (ప్రజా జ్యోతి):** నారాయణపేట జిల్లా మక్తల్ మండల కేంద్రంలో గత మూడు రోజుల నుండి కురుస్తున్నటువంటి వర్షాలకు చిన్న గోపులాపూర్ భీమా ఫేజ్ 1 నుండి సంగంబండ బాలెన్సింగ్ రిజర్వాయర్ నీరు నింపేందుకు తీసినటువంటి గ్రావిటీ కెనాల్ కాలువ వర్షపు నీటికి కోతకు గురైంది. మక్తల్ పట్టణంలో కురిసిన వర్షపు నీటితోపాటు పెద్ద చెరువు అలుగు నీరు ఖానాపూర్ గ్రామ చెరువుకు వెళ్లేందుకు గ్రావిటీ కెనాల్ పై ఏర్పాటు చేసినటువంటి పిల్ల కాలువ సరిగ్గా లేకపోవడంతో సంగమండ రిజర్వాయర్ కు నీరు వచ్చేటటువంటి ప్రధాన కాలువ వర్షపు నీటికి గండి పడడంతో వర్షపు నీరు ప్రధాన కాలువలోకి చేరుతుందని దీంతో గ్రావిటీ కెనాల్ కాలువ పూడికకు గురవుతున్న అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు తెలిపారు. ఇదిలా ఉంటే ప్రతి సంవత్సరం వర్షాకాలంలో కాలువ గండిపడడం జరుగుతుందని అధికారులు మాత్రం తూతూ మంత్రంగా గండి పడిన ప్రాంతంలో ఉన్నటువంటి మట్టిని వేసి సరి చేస్తున్నారే తప్ప పట్టణం నుండి వచ్చే వర్షపు నీటిరు ఖానాపూర్ గ్రామ చెరువులోకి వెళ్లేందుకు శాశ్వత పరిష్కారం చేయడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# పెద్ద మారూర్ గ్రామంలో ఘనంగా సంకటహర గణపతి రథశీ


**" నూతనంగా నిర్మించిన గణపతి మండపం**



**చిన్నంబావి మండలం,ఆగస్టు 13 ప్రజాజ్యోతి** చిన్నంబావి మండలం పెద్ద మారూర్ గ్రామంలో ఘనంగా భక్తులు ఉపవాసం పాటించి, గణనాధుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం నాడు. వేద పండితులైన ప్రసాద్ శర్మ, సంకటహర గణనాధుడికి ప్రత్యేక స్వామి విగ్రహానికి భక్తితో వేదమంత్రాలతో పంచామృత అభిషేకాలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమం లో మహిళలు అలాగే యువకులు పాల్గొన్నారు. తదుపరి వచ్చిన వారికి అన్న ప్రసాద చేశారు. గ్రామస్తులు అందరు "సంకటహర గణపతి రథం దర్శించుకున్నారు ప్రతి నెలలో జరుగుతుందని దేవాలయ కమిటీ సభ్యులు తెలిపారు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# క్రీడాభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద పీట





- రానున్న కాలంలో వనపర్తి క్రీడలకు పుట్టినిల్లు
- జిల్లాలో పలు క్రీడా అభివృద్ధి పనుల నిర్మాణాలకు స్థలాల పరిశీలన

**వనపర్తి ప్రతినిధి, ఆగస్టు 12 (ప్రజా జ్యోతి):** విద్యాపర్తిగా పేరెన్నిక గన్న వనపర్తి జిల్లా రానున్న కాలంలో క్రీడలకు పుట్టినిల్లుగా మారబోతుందని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘా రెడ్డి, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ మేనేజింగ్ డైరెక్టర్ సోనీ బాల పేర్కొన్నారు. మంగళవారం వనపర్తి జిల్లా కేంద్రంలో క్రీడల అభివృద్ధి పరంగా నూతనంగా చేపట్టబోయే మెడికల్ కళాశాల పక్కనగల ఎనిమిదిన్నర ఎకరాలలో క్రీడా మైదానం నిర్మాణం, వనపర్తి బాలుర జూనియర్ కళాశాల మైదానంలో స్విమ్మింగ్ పూల్, జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల డిగ్రీ కళాశాల పక్కన గల మైదానంలో హాకీ టర్ఫ్ మైదానం, శ్రీనివాసపురం శివారులో 35 ఎకరాల్లో క్రీడా పాఠశాల ఏర్పాటు కు వారు స్థల పరిశీలనలు చేశారు. వీటి నిర్మాణాలకు త్వరలోనే పరిపాలన అనుమతులు జారీ అవుతాయని వీటికి సంబంధించిన పూర్తిస్థాయి వివరాలను వెంటనే సమర్పించాలని వారు అధికారులకు సూచించారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యా రంగంలో పేరు గాంచిన వనపర్తి జిల్లా కేంద్రాన్ని రానున్న కాలంలో క్రీడారంగంలోనూ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకువచ్చేలా అన్ని వసతులను ఏర్పాటు చేస్తామని ఇక్కడి నుంచే జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులను తయారు చేసే విధంగా తర్ఫీదు నుంచి క్రీడాకారులను తయారు చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, వనపర్తి పట్టణ మాజీ కౌన్సిలర్లు, మండల నాయకులు, క్రీడా శాఖ అధికారులు, ఆర్డిఓ, తాహసిల్దార్ తదితరులు పాల్గొన్నారు.

# రైతు భీమాకు దరఖాస్తు చేసుకునేందుకు నేడే చివరి అవకాశం

**: జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వెంకటేష్**



**మహబూబ్ నగర్ ఆగస్టు 12 ( ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి )** రైతు భీమా పథకానికి రైతులు దరఖాస్తు చేసుకునేందుకు బుధ వారం ఆగస్టు 13 చివరి తేదీ అని జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేష్ ఒక ప్రకటన లో తెలిపారు. ఆగస్టు 13వ తారీకు లోగా రైతు స్వయంగా వచ్చి మాత్రమే వ్యవసాయ విస్తరణ అధికారికి దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. రైతు భీమా పతహకానికి లి రైతు వయస్సు ఆధార్ కార్డు ప్రకారము 18 నుండి 59 సం?ల లోపు ఉండాలని, లి 2025 జూన్ 5వ తారీకు లోగా రెవెన్యూ శాఖ తహశీల్దార్ చే డిజిటల్ సంతకం చేసి, రైతుకు తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన కొత్త పట్టాదారు పాసుపుస్తకం వచ్చి ఉండాలి లేదా రెవెన్యూ శాఖ వారు ఇచ్చే పట్టాదారు పాసు పుస్తకం డ్రాఫ్ట్ ఆఫీస్ కాపీ అయినా వచ్చి ఉండాలని ఆయన తెలిపారు. రైతుకు ఎన్నిచోట్ల భూములు ఉన్నా, ఎన్ని పట్టాదారు పాసు పుస్తకాలున్నా ఒక్కసారి, ఒక్కచోట నుండి మాత్రమే రైతుభీమా చేయించుకుంటే సరిపోతుందని ఆయన స్పష్టం చేశారు. ఇంతకుముందే రైతుభీమా చేయించుకుంటే మళ్ళీ ధరఖాస్తు చేయవలసిన అవసరం లేదని పేర్కొన్నారు. ఒకవేళ రైతు వివరాలు లేదా నామినీ వివరాలు మార్చదలచుకున్న రైతులు మాత్రమే మళ్ళీ కొత్త దరఖాస్తు అంద చేయాలని అన్నారు. కొత్త రైతులు ధరఖాస్తు చేసుకోవడానికి రైతుభీమా ధరఖాస్తు ఫారము, రైతు ఆధార్ కార్డు జీరాక్స్, రైతు తనకు నామినీగా పెట్టదలచుకున్న వ్యక్తి యొక్క ఆధార్ కార్డ్ జీరాక్స్, ఒక వేళ నామినీ వయస్సు 18 సం?ల లోపు ఉంటే ఇంకొక వ్యక్తిని గార్డియన్ గా పెట్టాలి కాబట్టి నామినీ ఆధార్ కార్డు జీరాక్స్ పాటు గార్డియన్ ఆధార్ కార్డు జీరాక్స్ కూడా జత చేయాలని తెలిపారు. కొత్త పట్టాదారు పాస్ పుస్తకం జీరాక్స్ లేదా డ్రాఫ్ట్ ఆఫీస్ కాపీ జీరాక్స్ కూడా జత పరచాలని అన్నారు. పైన తెలిపిన జీరాక్స్ కాపీలు , ధరఖాస్తు ఫారము తీసుకొని రైతు తప్పని సరిగా స్వయంగా వ్యవసాయ శాఖ రైతు వచ్చి వ్యవసాయ విస్తరణ అధికారికి బుధ వారం లోగాధరఖాస్తు చేసుకోవాలని ఆయన ఈ ప్రకటన లో విజ్ఞప్తి చేశారు.

# మండలానికి ఒక క్రీడా మైదానాన్ని నిర్మిస్తా

**తెలంగాణ రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి**



**నరు ఆగస్టు 12( ప్రజాజ్యోతి )** మండలానికి ఒక క్రీడా మైదానం ఏర్పాటు చేయడమే నా లక్ష్యం అని తెలంగాణ రాష్ట్ర పశుసంవర్ధక క్రీడాలు మత్స్యశాఖ, మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు,, మంగళవారం నర్వ మండలం, ఊటుకూరు, అమరచింత మరియు సంవర్ధక, డైరీ అభివృద్ధి, క్రీడలు, యువజన సేవలు మరియు మత్స్యశాఖ మంత్రి డా. వాకిటి శ్రీహరి గారు పరిశీలించారు., నర్వలోని జాంద్రగుట్ట వద్ద ఆరు నెలల క్రితం క్రీడా మైదానం కోసం స్వీకరించిన ఐదున్నర ఎకరాల స్థలాన్ని పరిశీలించారు, ఈ కార్యక్రమంలో. రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శ్రీ శివసేన రెడ్డి గారు, వీసీ ఎండీ శ్రీమతి సోని బాల దేవి గారు, జిల్లా కలెక్టర్ శ్రీ ఆదర్శ్ సురభి గారు, స్పోర్ట్స్ విభాగం అధికారులు మరియు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. ఈ క్రీడ మైదానాలకు కావలసిన నిధులను త్వరలోనే మంజూరు చేయిస్తామని వచ్చే విద్య సంవత్సరానికల్లా మైదానాల పనులు పూర్తి చేస్తామని తెలిపారు , ఈ కార్యక్రమంలో మల్లారెడ్డి ఎంపీడీవో శ్రీనివాసులు, కాంగ్రెస్ నాయకులు, కృష్ణారెడ్డి, జగన్మోహన్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి, శరణప్ప, వివేకవర్ధన్ రెడ్డి, అశోక్ గౌడ్ అంజిరెడ్డి,, తదితరులు

## రాజీవ్ గాంధీ సద్భావన జ్యోతి యాత్రకు మంత్రి వాకిటి శ్రీహరి ఘన స్వాగతం



**మఖ్తల్ నియోజకవర్గ ప్రతినిధి, ఆగస్టు 12 (ప్రజా జ్యోతి):** రాజీవ్ గాంధీ 81వ జన్మదినాన్ని పురస్కరించుకుని 34 వ రాజీవ్ గాంధీ సద్భావన జ్యోతి యాత్రను ఆగస్టు 9న తమిళనాడు రాష్ట్రంలోని శ్రీపేరంబద్దూరు నుండి ప్రారంభించి కర్ణాటక, తెలంగాణ, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఉత్తర ప్రదేశ్ హర్యానా మీదుగా ఆగస్ట్ 19 వరకు డిల్లీకి చేరుకోనుంది ఈ సందర్భంగా కర్ణాటక రాష్ట్రం నుండి తెలంగాణ రాష్ట్రంలో ప్రవేశించిన యాత్ర నారాయణపేట జిల్లా కృష్ణా మండలం టై రోడ్డు దగ్గర రాజీవ్ గాంధీ జ్యోతి యాత్రకు కాంగ్రెస్ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. తెలంగాణ రాష్ట్ర పశుసంవర్ధక ,క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి మక్తల్ పట్టణంలో అంబేద్కర్ సర్కిల్ లో రాజీవ్ గాంధీ జ్యోతినీ అందుకొని యాత్రకు ఘన స్వాగతం పలికారు. రాజీవ్ గాంధీ జ్యోతి యాత్ర జాతీయ అధ్యక్షుడు దొరై నాయకత్వంలో 150మంది కార్యకర్తలతో కొనసాగిస్తూ ఉగ్రవాదానికి వ్యతిరేకంగా, దేశ నిర్మాణం దేశ ఐక్యతను చాటాలనే ఉద్దేశంతో ప్రజలకు అవగాహన కల్పిస్తూ రాజీవ్ గాంధీ జ్యోతి యాత్రను కొనసాగుతుందని వారు తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర పశుసంవర్ధక మత్స్య పాడి పరిశ్రమ అభివృద్ధి క్రీడలు యువజన శాఖ మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ దివంగత రాజీవ్ గాంధీ సద్భావన సందేశం దేశంలోని ప్రతి హృదయంలో ఒక్కటై ముందుకు సాగాలని కుల, మత, వర్గ భేదాలు లేకుండా అందరం సమానంగా జీవించే సమాజం కోసం సద్భావన స్ఫూర్తిని కొనసాగించాలి అని పిలుపునిచ్చారు. ఆయన పాలనలోనే ఎలక్ట్రానిక్ రంగంలో అభివృద్ధి సాధించిందని అందుకు ప్రతిగా నేడు మనం వాడుతున్న సెల్ఫోన్లు లాప్టాప్ లు. అధునాతన ఎలక్ట్రానిక్ వస్తువులు ఆయన ప్రోత్సహించడం వల్లనే అని మంత్రి వాకిలి శ్రీహరి అన్నారు. ఈ కార్యక్రమంలో రాజీవ్ గాంధీ జ్యోతి యాత్ర జాతీయ అధ్యక్షుడు దొరై,తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ చైర్మన్ శివసేన రెడ్డి, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ సుజేంద్ర శెట్టి తదితరులు పాల్గొన్నారు.

## ? అలుగు పారుతున్న చెక్ డ్యాములు



**? అడ్డాకుల. ఆగస్టు 12 (ప్రజా జ్యోతి )** ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలతో అడ్డాకుల మండలంలోని కందూరు పెద్దవాగులో ఏర్పాటుచేసిన చెక్ డ్యాములు అలుగు పారుతున్నాయి. అడ్డాకుల మండలములోని చౌడాయిపల్లి, కందురు, పొన్నకల్ రాచాల, ముత్యానంపల్లి గ్రామాలలోని వాగులో గత ప్రభుత్వంలో ని దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి చెక్ డ్యాములను నిర్మించారు. దీంతో కందూరు పెద్దవాగులోని వాగులో నీటితో వివిధ గ్రామాలలోని చెరువులను నీటితో నింపుతున్నారు. చెక్ డ్యాములు నిర్మించడం వల్ల భూగర్భ జలాలు పెరుగుతున్నాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# విద్యాబోధనలో వినూత్న బోధనా పద్ధతులు పాటిద్దాం

ప్రజా జ్యోతి / 12/2025 కృష్ణ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ముడుమాల్ ను గుడెబల్లూర్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు శ్రీ గణేశ్ సింగ్ మంగళవారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ దండు శేఖర్ బోధిస్తున్న 5వ తరగతి తెలుగు మన జెండా పాఠ్యాంశాన్ని పరిశీలించారు. తరగతి బోధనలో, బోధనలో వినూత్న పద్ధతులను పాటించడం చాలా ముఖ్యం ఇవి విద్యార్థుల అభ్యాసన అనుభవాన్ని మెరుగుపరచడానికి మరియు వారిని మరింత నిమగ్నమయ్యేలా చేయడానికి ఇవి జెండా పాఠ్యాంశం గురించి వివిధ ప్రశ్నలు అడిగే సమాధానాలు రాబట్టి అభినందించారు. విద్యార్థులచే పఠనం చేయించి సంతృప్తి వ్యక్తం చేశారు.అలాగే పాఠశాల తనిఖీలో భాగంగా తరగతి బోధన ఏఐ నిర్వహణ రికార్డు, లైబ్రరీ నిర్వహణ రికార్డు, భవిత కేంద్రం వివరాలు-రికార్డు పిటియం నిర్వహణ రికార్డు ఉపాధ్యాయుల సమీక్ష సమావేశాల రికార్డు, మధ్యాహ్న భోజన నిర్వహణ రికార్డు: స్టాక్, బిల్, టేస్ట్ రిజిస్టర్స్ ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్ విద్యార్థుల హాజరు రిజిస్టర్స్ పరిశీలించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానో పాధ్యాయులు దండు శేఖర్,ఉపాధ్యాయ బృందం మధ్యాహ్న భోజన సిబ్బంది తదితరులు ఉన్నారు.



# ఆదివాసుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది

ం-ప్రాచీన చరిత్రకు సంస్కృతికి నిలువుటద్దం ఆదివాసులు

ంఅచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ

ఘనంగా అంతర్జాతీయ ఆదివాసుల దినోత్సవం

**అచ్చంపేట ఆగస్టు 12 ( ప్రజా జ్యోతి)** అటవీ లోతట్టు ప్రాంతంలో జీవిస్తున్న ఆదివాసుల సంక్షేమానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే వంశీకృష్ణ అన్నారు. మంగళవారం ప్రపంచ ఆదివాసుల దినోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ కలెక్టర్ బాధావత్ సంతోష్ లతో కలిసిఘనంగా ఆదివాసులు అచ్చపేట కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం క్యాంప్ కార్యాలయంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ ఆదివాసుల మహిళలతో కలిసి ఆడిపడటం ఎంతో సంతోషాన్ని కలిగించిందని ఆయన పేర్కొన్నారు. 9వ తేదీ నాడు అంతర్జాతీయ ఆదివాసి దినోత్సవం వేడుకలు నిర్వహించాల్సిన ఉన్న నేపథ్యంలో రాఖీ పౌర్ణమి పండుగ నందు రాలేదు ఉన్నందున నేడు వేడుకలను నిర్వహించుకోవడం జరుగుతుందని ఎమ్మెల్యే ఎంత ఎత్తుకు ఎదిగిన ఆదివాసి గిరిజనులు మన అస్తిత్వం మూలాలను ఎన్నటికీ మర్చిపోకూడదు అని ఈ సందర్భంగా ఎమ్మెల్యే సూచించారు. కాగా ఒకప్పుడు ఆదివాసులకు చదువు లేదని రాదని చెప్పిన ఎంతోమంది చెప్పిన స్థాయి నుంచి ఇప్పుడు నల్లమలలో ఆదివాసి విద్యార్థులు విద్యార్థినులు పదో తరగతితో పాటు ఇంటర్మీడియట్ ఉన్నత పరీక్షల్లో సత్తా చాటుతున్నారని ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా ఆదివాసుల ఆహారం అలవాట్లో కూడా మార్పులు చెందారని ఇప్పుడు స్టార్ హోటల్లో ఆదివాసులు రొట్టె అంబలి సూప్ లను ఆస్వాదిస్తున్నారని ఎమ్మెల్యే వ్యాఖ్యానించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదివాసి గిరిజనుల కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నో సంక్షేమ పాలాలు అందిస్తున్నారన్నారు. విద్యార్థులకు డైట్ కాస్మోటిక్ ఛార్జీలు పెంచడం జరిగిందన్నారు. ఎస్టీ రైతులకు సోలార్ పవర్ తో సాగు చేసుకునే విధంగా తోడ్పాటు అందిస్తున్నామన్నారు. బడ్జెట్లో ట్రైబల్ శాఖకు 15 వేల కోట్లు కేటాయించడం జరిగిందని ఈ సందర్భంగా ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బదవలు సంతోష్ డీఎ4 రోహిత్ గోపిడి ఆర్డిఓ మాధవి ఆదివాసుల సంఘాల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు



# చిన్నంబావి మండలం లోని బిజెపి నాయకుల అక్రమ అరెస్ట్

**చిన్నంబావి మండలం, ప్రజా జ్యోతి ఆగస్టు 12** చిన్నంబావి మండల పరిధిలోని వివిధ గ్రామాలలో బిజెపి మండల నాయకులను అక్రమంగా అరెస్టు చేశారని చిన్నంబావి మండల బిజెపి పార్టీ అధ్యక్షుడు బొగ్గు కురుమయ్య ఆరోపించారు. గత కొన్ని రోజుల క్రితం హైదరాబాద్ జూబ్లీహిల్స్ లోని గత నెల పాత పెద్దమ్మ తల్లి దేవాలయాన్ని ప్రభుత్వం అక్రమంగా తొలగించింది. ఇది అన్యాయమని ప్రశ్నించిన స్థానికులపై మరియు హిందుత్వ సంఘాలపై అక్రమంగా కేసులు పెట్టి వారిని ఇబ్బంది పెడుతున్నారు. ఇప్పటికే రాష్ట్రంలో ఎన్నో దేవాలయాలని ఆక్రమంగా కూల్చేశారు ముష్కరులు ఎన్నోసార్లు దేవాలయాలపై దాడులు చేశారు. వారి పై ఎలాంటి చర్యలు తీసుకోకుండా దేవాలయాలని రక్షించాలని పోరాడుతున్న హిందుత్వవాదులపై కేసులు పెట్టడం తగదని తక్షణమే అక్కడ పెద్దమ్మతల్లి దేవాలయాన్ని పునర్నిర్మాణం చేయాలని హిందు వాహిని వనపర్తి జిల్లా శాఖ డిమాండ్ చేస్తుంది. అందుకు చిన్నంబావి బిజెపి మండల అధ్యక్షుడు బొగ్గు కురుమయ్య, హిందు వాహిని మరియు బీజేపీ కార్యకర్తలు కత్తి జానీ, ఉగ్ర నరసింహను పోలీసులు ముందస్తుగా నిరసన కార్యక్రమానికి వెళ్లకుండా అరెస్ట్ చేశారు. ఉగ్ర నరసింహ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా దేవాలయాల పై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండించలని, మళ్లీ ఇలాంటి దాడులను పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కత్తి జానీ మాట్లాడుతూ దేవాలయాల పైన జరుగుతున్న దాడులను ఖండిస్తూ దాడులు చేస్తున్న వారిని ప్రభుత్వము తక్షణమే అరెస్టు చేసి వారిని ప్రభుత్వ కఠినంగా శిక్షించాలని కోరారు.



# రాహుల్ గాంధీని అరెస్ట్ చేయడం అప్రజాస్వామికం

**కాంగ్రెస్ పార్టీ మైనారిటీ సెల్ వైస్ చైర్మన్ మొహమ్మద్ నిజామోద్దీన్**



**కల్వకుర్తి, ఆగస్టు 12 (ప్రజా జ్యోతి):** ఓట్ల చోరీ పై ఆధారాలతో సహా నిరూపించి దేశ వ్యాప్త ఉద్యమానికి శ్రీకారం చుట్టిన ప్రతిపక్ష కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ సహా విపక్ష ఇండియా కూటమి పార్టీల ఎంపీలను పోలీసులు అరెస్ట్ చేయడం అక్రమం..అప్రజాస్వామికమని నాగర్ కర్నూల్ డీసీసీ మైనారిటీ సెల్ వైస్ చైర్మన్ మొహమ్మద్ నిజామోద్దీన్ ఖండించారు. ఎన్నికల సంఘాన్ని కలిసి ఓట్ల చోరీపై వినతి పత్రం ఇస్తామని శాంతి యుతంగా వెళ్తున్న ఎంపీలను అరెస్ట్ చేయడం అప్రజాస్వామిక చర్యగా విమర్శించారు. ఓట్ల చోరీ పై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.దేశవ్యాప్తంగా భారత్ జోడో , నఫ్రత్ చోడో ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడాలని పోరాటం చేస్తున్న రాహుల్ గాంధీ ఓట్ల చోరీ పై పోరాటం చేస్తున్నారు. శాంతియుత ర్యాలీ ద్వారా ఈసీ కి వినతి పత్రం సమర్పించాలని భావించిన మా నాయకులను అరెస్ట్ చేయడం సరికాదు దీనికి బీజేపీ ప్రభుత్వం మూల్యం చెల్లించుకోక తప్పదు అని నిజాముద్దీన్ వ్యాఖ్యానించారు.

# అకాల వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**ప్రజల భద్రతకే మా ప్రాధాన్యం**

**అత్యవసరమైతే తప్ప ప్రజలు ఎవరు బయటకు రావద్దు**

**జిల్లా ఎస్పీ డి.జానకి**



**మహబూబ్ నగర్ బ్యూరో( ప్రజా జ్యోతి) ఆగస్టు 12:** రానున్న మూడు రోజుల్లో వర్షాలు విస్తారంగా కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ డి. జానకి అన్నారు. మంగళవారం నాడు ఆమె మాట్లాడుతూ ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని అన్నారు. ఎప్పటికప్పుడు స్థానిక పోలీస్ లతో సంప్రదింపుల్లో ఉండాలని తెలిపారు. తక్కువ ఎత్తులో ఉన్న ప్రాంతాలు లేదా కాజ్వేలను దాటరాదని తెలిపారు.ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వలన జిల్లాలోని నదులు, వాగులు, వంకలు, చెరువులు పొంగి రోడ్లపైకి నీరు చేరే అవకాశం ఉన్నందున కాలి నడకన లేదా వాహనాలతో రహదారులు దాటేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని అన్నారు. సెల్ఫీల కోసం ఉధృతంగా ప్రవహిస్తున్న ప్రదేశాలకు వెళ్లి ప్రమాదాలకు గురి కావద్దని హెచ్చరించారు.అలాగే నదులు వాగులు వంకల వద్దకు చేపల వేటకు వెళ్ళకూడదని పశువులను కాయడానికి ఆ ప్రాంతాల వద్దకు వెళ్లవద్దని తెలిపారు. సాధ్యమైనంత వరకు అత్యవసర సమయాల్లో తప్ప మిగిలిన సమయాలలో బయటకు రాకుండా ఉండాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. జిల్లా పోలీస్ యంత్రాంగం ఇతర శాఖలతో సమన్వయం చేసుకొని ప్రమాదకరంగా మారుతున్న రహదారులు నీటిముఖాల వద్ద ఎలాంటి ప్రమాదాలు జరగకుండా పటిష్ట చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. గంటలు అధికారులందరూ అందుబాటులో ఉండే విధంగా డిడిఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచినట్లు ఆమె ఎదుర్కొంటున్నట్లయితే వెంటనే డయల్ 100 కి ఫోన్ చేసి సమాచారం అందించి పోలీస్ సేవలను పొందాలని అన్నారు. ప్రమాదాలు నివారించడంలో పోలీస్ ల చర్యలకు ప్రజలు సహకరించాలని ఆమె తెలిపారు.